# మనసులో మాట

సంఘమిత్ర పత్రిక ఆవిర్భవించి ఈ విజయదశమికి ఏడాది కావస్తోంది. జన్మదిన సంచిక కొన్ని ప్రత్యేకమైన శీర్షికలతో వెలువడింది. మీకు ఈ సంచిక విజ్ఞాన, వినోద, వికాసాలని అందిస్తుందని నమ్ముతూ, ఈ పత్రిక ముఖ్యోద్దేశమును తిరిగి గుర్తుచేస్తున్నాము. పెద్ద సంఖ్యలో స్పందిస్తున్న పాఠక మహాశయులకు నమస్సులు.

ఇక గడిచిన మూడు నెలలలో Katrina, Rita లు చాలా ఆస్థి, ప్రాణ నష్టాన్ని కలిగించాయి. భారతదేశములో కూడా అతివృష్టి, అనావృష్టి కారణముగా ఎన్నో ప్రాంతాలు సతమతమవుతున్నాయి. ప్రకృతిని మనము రక్షిస్తే అది మనని రక్షిస్తుందని మనకందరికి తెలుసు. కాని ప్రకృతిని రక్షించడములో మనము మన పాత్ర పోషించడములేదనే చెప్పాలి. మొక్కలు నాటడము, చెట్లు పెంచడము, వాతావరణ కాలుష్యము తగ్గించడము ఇవన్నీ ప్రస్తుత పరిస్థితులలో అనివార్యము.

ఈ సంచిక చక్కగా తయారుకావడానికి ప్రత్యక్షముగాను, పరోక్షముగాను ఎందరో సహకరించారు. ముఖ్యముగా విలువైన సలహాలను అందించి, సంఘమిత్ర కొఱకు ఏదైనా వ్రాయుమని అడిగితే, కాదనకుండా ఒక వ్యాసమును వ్రాసి అందించిన డాక్టర్. రామనాధంగారికి, తెలుగు Word Software ను అందరికి ఉపయోగపడేటట్లు తీర్చిదిద్దిన పెంద్యాల రాంబాబు గారికి, అడగగానే విజయదశమిని పురస్కరించుకుని శక్తి పీఠముల గురించి వ్యాసాన్ని, ప్రశ్నావళిని అందించిన వర్ధనిగారికి, ముఖచిత్రమును, సి.వి. రామన్ చిత్రాన్ని అందించిన (పేరు తెలియజేయడానికి ఇష్టపడని) ఓ వర్ధమాన కళాకారునికి (సంతకము ఎస్.ఆర్) సంఘమిత్ర సంపాదక వర్గం ధన్యవాదములు తెలియజేస్తోంది. ఈసారి సి.వి.రామన్ జయంతి, ఆంధ్రప్రదేశ్ అవతరణ, గాంధీ జయంతి, దసరాలను దృష్టిలో నుంచుకొని పత్రికలో వాటికి సంబంధించిన అంశాలను పొందు పరిచాము. ఇక సెయింట్ లూయిస్‌లో జరిగిన - ప్రఖ్యాత కళాకారిణి, అన్నమయ్య సంకీర్తనా గానం ఆమె జీవితములో ఓ భాగమైన, శోభారాజు గారి కచేరీ విశేషాలు, జూన్, జులై మాసములలో సంఘమిత్ర నిర్వాహణలో జరిగిన 'శ్రీనివాస రామానుజన్ మేథమేటిక్స్ క్లబ్' విశేషాలు సంఘమిత్ర పాఠకుల కోసం పొందుపరిచడం జరిగింది.

పొడుపుకథలు, చెప్పుకోండి చూద్దాం!, సమస్యలతో'రణం', పదచదరంగం, మేథమేటిక్స్‌లకు సమాధానములు పంపించిన వారికి - విజేతలకు, కానివారికి కూడా అభినందనలు. పాఠకులు పంపించిన సలహాలను త్వరలో విశ్లేషించి అమలు చేయడం జరుగుతుంది. మీకు నచ్చిన అంశాలు, నచ్చని అంశాలు మాకు తెలియజేయండి. నచ్చడానికి/నచ్చకపోవడానికి కారణము కూడా తెలియజేస్తే బాగుంటుంది. ఓ పత్రిక ఆగమనానికి, గమనానికి పాఠకుల సహకారమే ఊపిరి అని మా విశ్వాసము. వచ్చే సంక్రాంతి సంచికలో కలుద్దామా!

సంఘమిత్ర సంపాదక వర్గము.